క్లుప్తంగా

నెలాఖరు కల్లా రీసర్వే పూర్తి చేయాలి

ఇన్‌చార్జి కలెక్టర్ శ్యాంప్రసాద్



ముప్పాళ్ళ: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా మండలంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే ప్రక్రియపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మొదటి విడత ఎంపిక చేసిన ఆరు గ్రామాల్లో రెండు గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మరో గ్రామంలో చివరిదశలో ఉందని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ ఇన్‌చార్జ్ కలెక్టర్ కు వివరించారు. పూర్తయిన గ్రామాల్లో వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. లంకెలకూరపాడులో రైతులకు నోటీసులు అందిస్తున్నామని చెప్పారు. మిగిలిన మూడు గ్రామాల్లోను సర్వే త్వరితగతిన చేపట్టి నెలాఖరు కల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మీసేవ, సచివాలయాల ద్వారా అందిన అర్జీలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. రీసర్వే పై సర్వేసిబ్బందికి పలు సూచనలు చేశారు. డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ శ్రీకాంత్ ఉన్నారు.

29న నూర్‌బాషాముస్లింల సింహగర్జన సభ



క్రోసూరు: ఈనెల 29న నిర్వహించనున్న నూర్‌బాషా(దూదేకుల) ముస్లింల సింహగర్జన జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. క్రోసూరులో ఆ సంఘం ప్రతినిధులు పోస్టర్లు శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గుంటూరులోని ఆంధ్రముస్లిం కళాశాల ఆవరణలో మధ్యాహ్నం మూడుగంటలకు సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమం సంఘం అధ్యక్షుడు షేక్ జాన్‌బాషా, కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పరిశుభ్రత లోపిస్తే చర్యలు

సత్తెనపల్లి: పట్టణంలో పరిశుభ్రత లోపిస్తే చర్యలకు సిఫార్సు చేయక తప్పదని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులో అక్కడక్కడ అధ్వానంగా ఉన్న శానిటేషన్ ను పరిశీలించి మరోసారి ఇలా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డులో ప్రతి కాలువ, చెత్తాచెదారం, డ్రైనేజ్ వంటి వాటిపై నిరంతర పర్యవేక్షణ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథికి సూచించారు. ఆయనతో పాటు కౌన్సిలర్ శెట్టి ఆనంద్, సెక్రటరీలు వంశీ, గౌరీ, శంకర్, మేస్త్రి ఫ్రాన్సిస్ ఉన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత

క్రోసూరు: మండలంలోని హసనాబాద్ గ్రామంలో శుక్రవారం క్రోసూరు సీఐ వీరాస్వామి, పోలీసు సిబ్బంది జరిపిన దాడుల్లో గంజాయి కలిగి ఉన్న మహిళ కేశనబోయిన వెంకయమ్మను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 65 గ్రాముల గంజాయిని స్వాధీన పరుచుకున్నారు. గంజాయి సరఫరా విషయాలపై విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

నేడు భారత బచావో జిల్లా మహాసభ

సత్తెనపల్లి: భారత్ బచావో పల్నాడు జిల్లా మహాసభలు ఈనెల 21న నరసరావుపేట రామిరెడ్డి పేటలోని కృష్ణవేణి మహిళా డిగ్రీ కాలేజీ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు బత్తుల కోటేశ్వరరావు కోరారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం భారత బచావో సభ్యుల సమావేశంలో నిర్వహించారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, సామాజిక ఉద్యమకారుడు ఆర్.పురుషోత్తం, ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వేము సమత, దళిత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరబండి ఆంథోనీ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

- మంత్రి అంబటి రాంబాబు
- కందులవారిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

సత్తెనపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా మారిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని కందులవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ చేపట్టిన ఈ బృహత్తర కార్య క్రమం దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటుందన్నారు. టీడీపీ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైపోయిన ప్రభుత్వ ఆసుపత్రులకు పూర్వవైభవం తీసుకురావడంతో పాటు ప్రజా ఆరోగ్యానికి అండగా నేనున్నానంటూ సీఎం వైఎస్ జగన్ భరోసా ఇచ్చారన్నారు. సురక్ష వైద్య శిబిరాల్లో గుర్తించిన దీర్ఘకాలిక జబ్బులకు ఆరోగ్య శ్రీ పథకం కింద ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతి పౌరుని సమగ్ర ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజల చెంతకే స్పెషలిస్ట్ వైద్యుల సేవలు అందిస్తున్నారన్నారు. మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి మీకు మేలు జరిగితేనే నాకు ఓటు వేయండి అని ధైర్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెబుతూ ఉంటే ప్రతిపక్షాలు మాత్రం విష ప్రచారం చేస్తున్నాయని.. రాష్ట్రం అథోగతి పాలవుతుందని విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడారు. వైద్యులు ఎస్‌వీఎన్ సాయితేజరెడ్డి, యూఎస్‌ఎల్ కవిత, నందగోపాల్, కాశీ విశ్వనాథ్ 424 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 111 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 88 మందికి కళ్లజోళ్ల పంపిణీ చేశారు. 13 మందికి కాటరాక్ట్ వైద్య పరీక్షల నిమిత్తం సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రైతు సలహా మండలి రాష్ట్ర సభ్యుడు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బూతుకూరి లక్ష్మి, సర్పంచి బూతుకూరి చిన్న వెంకటరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలకా జైపాల్, స్థానిక నాయకులు బూతుకూరి లక్ష్మారెడ్డి, ఈవూరి బ్రహ్మారెడ్డి, బూతుకూరి అంజిరెడ్డి, బూతుకూరి బ్రహ్మారెడ్డి, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, పిట్టల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కందులవారిపాలెంలో మందుల కిట్ పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

కుంకలగుంటలో..

నకరికల్లు: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా పేదలందరికీ వైద్యం చేరువైందని డీఎంహెచ్ఓ రవికుమార్ అన్నా రు. మండలంలోని కుంకలగుంటలో జగనన్న ఆరో గ్య సురక్ష వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ వి.శ్రీనునాయక్, డాక్టర్ సీహెచ్ వెంకటే శ్వర్లు, డాక్టర్ ఎం.పూజశ్రీ, డాక్టర్ అభినవ్, డాక్టర్ అలేఖ్య, వైద్యసిబ్బంది కలసి శిబిరానికి హాజరైన వారికి బీపీ, షుగర్, రక్తశాతం, కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రవికుమార్ మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ వైద్యులు గ్రామాల్లోకి వచ్చి వైద్యసేవలు అందించడం ద్వారా మారుమూల గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ ఎంకేఎస్ గిరిధర్, ఎంఈఓ ఎన్.ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.నాగమణి, సర్పంచి సుంకర మరియమ్మ, ఉపసర్పంచి సింగరాజు అంకారావు, ఎంపీటీసీ సభ్యులు వర్ల మరియమ్మ, అవుదూరి అంజిరెడ్డి పాల్గొన్నారు.

చామర్రులో వైద్యశిబిరం..

అచ్చంపేట: జగన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వం అందచేస్తున్న వైద్య సేవలు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని చామర్రులో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 326 మందికి పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు ఇన్నారావు, రాంబాబు, స్పెషలిస్ట్ వైద్యు లు డాక్టర్ నవ్య, డాక్టర్ రాజేష్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, గ్రామ సర్పంచి కంబాల వీరబాబు, ఎంపీటీసీ తెల్లమేకల నాగరాజు, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, సీహెచ్ఓ శివనాగేశ్వరి, హెచ్ఎస్ రాధాకృష్ణ, హెచ్‌వీ రామకోటమ్మ పాల్గొన్నారు.

నెమలికల్లులో..

అమరావతి: మండల పరిధిలోని నెమలికల్లు గ్రామ సచివాలయ పరిధిలోని నెమలికల్లు, మండెపూడి గ్రామాలలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. నెమలికల్లులో శిబిరాన్ని ఎంపీపీ మేకల హనుమంతరావు ప్రారంభించారు. కార్యక్రమంలో అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ మాట్లాడారు. వైద్యాధికారులు రవిబాబు, మౌనిక, యశ్వంత్, సునీల్ సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచి కోవూరి రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నాయకులు చిలకా సాంబయ్య పాల్గొన్నారు.



కుంకలగుంటలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న డీఎంహెచ్ఓ రవికుమార్



చామర్రులో రోగులకు జగనన్న మెడికల్‌కిట్స్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ విజయప్రతాప్‌రెడ్డి



శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు..

పేదలందరికి మెరుగైన వైద్యమే లక్ష్యం

జేసీ శ్యాంప్రసాద్

సత్తెనపల్లి: పేదలందరికి మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ అన్నారు. పట్టణంలోని 1, 31 వార్డుల ప్రజలకు అంబేడ్కర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైన మందులు పొందాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, 1వ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, 31వ వార్డు ఇన్‌చార్జి ఆకుల హనుమంతరావు మాట్లాడారు. యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ జి.దర్మ సింగ్ శాస్త్రి, డాక్టర్ సుమిత్ర, డాక్టర్ కే సురేఖ, డాక్టర్ సుబ్బారావు 556 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 61 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 15 మందికి కళ్ళజోళ్ళు అవసరమని నిర్ధారించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పోషకాహార ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సురేష్, మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబ శివరావు, 1వ వార్డు కన్వీనర్లు వరికల్లు కోటిలింగం, కాటుమాల డేవిడ్, నాయకులు నిజాంపట్నం అమర్, షేక్ హనీఫ్, మధు ఉన్నారు.



మందుల కిట్ పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

మహాసరస్వతీదేవిగా అమ్మవారు

నకరికల్లు: దసరా శరన్నవరాత్రి వేడుకలు మండలంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రత్యేకమైన రోజు కావడంతో అమ్మవారికి భక్తులు విశేషపూజలు చేశారు. నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి మూలా నక్షత్రం పురస్కరించుకొని సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. శిబి చక్రవర్తి కాలం నాటి చరిత్ర కలిగిన మండలంలోని చేజర్లలోని కపోతేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. నర్సింగపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాసరస్వతీదేవి అలంకారం, మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకుదర్శనమిచ్చారు. పలుగ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

చదువులతల్లి సరస్వతిమాతగా అమ్మవారు

అచ్చంపేట: స్థానిక దేవాలయాలలో అమ్మవారు చదువుల తల్లి సరస్వతీ మాతగా శుక్రవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. సీతారామస్వామి దేవాలయం, గంగాభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో సరస్వతీమాత అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య మహిళాలు భజన కార్యక్రమాలు చేపట్టారు.

ముప్పాళ్లలో..

ముప్పాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారు శ్రీసరస్వతిదేవి అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. లంకెలకూరపాడులోని శ్రీగంగా పార్వతి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలోను, ముప్పాళ్లలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి, చాగంటివారిపాలెంలో ఏర్పాటు చేసిన మండపంలోను, నార్నెపాడులోని శంభులింగేశ్వరస్వామి ఆలయాల్లోను అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చాగంటివారిపాలెంలో భక్తులకు అన్నదానం చేశారు.

దేవీ దర్శనం .. భక్తుల పరవశం

సత్తెనపల్లి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, త్రిశక్తి దుర్గాపీఠం, సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వెంకటపతి కాలనీలోని నీలంపాటి లక్ష్మి అమ్మవారి పీఠం, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద శుక్రవారం అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద రూ. 1.50 లక్షలు కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకారం చేసి పూజలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సరస్వతీదేవీ గా వాసవీ అమ్మవారు

క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అన్నదానం చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు ఘనంగా సత్కరించారు.

సరస్వతీ దేవిగా అమ్మవారి దర్శనం

బెల్లంకొండ: మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మీ నిలయంలో శుక్రవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకార రూపంలో దర్శనమిచ్చారు. నవ దుర్గలలో సరస్వతీ దేవి అమ్మవారిది ఆరవ అవతారమని వేద పండితులు పులుపుల వేంకట ఫణికుమార శర్మ పేర్కొన్నారు.



నర్సింగపాడు.. సరస్వతీదేవిగా అమ్మవారు



చేజర్లలో.. సరస్వతీ దేవిగా అమ్మవారు



వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



బెల్లంకొండలో సరస్వతీ దేవిగా..



క్రోసూరులో.. వాసవీ కన్యకాపరమేశ్వరి..



పట్టణంలోని సరస్వతీ దేవీగా వాసవీమాతా..



లంకెలకూరపాడులో.. అమ్మవారు

ఇంటర్ తప్పిన విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్

అచ్చంపేట: ఇంటర్ తప్పిన విద్యార్థుల రీ అడ్మిషన్, పరీక్ష ఫీజు చెల్లింపు కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.పద్మ శుక్రవారం విలేకరులకు తెలిపారు. 2024 మార్చిలో నిర్వహించనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు గడువును నవంబర్ 30వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. ఇంటర్ తప్పిన విద్యార్థులు, డ్రాప్‌అవుట్ అయిన జనరల్, ఒకేషనల్ విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ గతంలో చదివిన కళాశాల ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

డీజీ లాకర్లలో సర్టిఫికెట్స్.....

ఇంటర్ పాసైన విద్యార్థుల కోసం ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ జె.పద్మ తెలిపారు. 2014 నుంచి 2023 మధ్య సంవత్సరాలలో పాసైన విద్యార్థుల సరిఫికెట్లను డీజీ లాకర్ల నుంచి డౌన్ లోడ్ చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఇంటర్ బోర్డు కల్పించిందన్నారు. విద్యార్థులంతా డీజీ లాకర్ యాప్‌ను సెల్‌ఫోన్‌లో, గూగుల్ ప్లేస్టోర్స్ ద్వారా డౌన్ లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ పొందిన తరువాత వారికి అవసరమైన సర్టిఫికెట్లు పొందవచ్చని ఆమె పేర్కొన్నారు.



జె.పద్మ, ప్రిన్సిపాల్

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి: ఉరి వేసుకుని ఎలక్ట్రీషియన్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని నిర్మాణంలో ఉన్న స్టేడియం భవనంలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు.. చిత్తూరు జిల్లా సోమల మండలం గల్లా వారి పల్లి గ్రామానికి చెందిన ముత్యాల నరేష్ కుమార్(35) ఎలక్ట్రీషియన్ గా పని చేస్తూ జీవనం వెళ్ళదీస్తున్నాడు. మృతుడికి వివాహం కాలేదు. తల్లిదండ్రులు కూడా లేరు. సోదరుడు బెంగళూరులో పనిచేస్తుండగా, సోదరి చిత్తూరు జిల్లాలో ఉంటుంది. ఈ క్రమంలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ మద్యానికి బానిస అయ్యాడు. దీనికి తోడు అనారోగ్య సమస్యలు ఉండడంతో మతిస్థిమితం లేక వ్యవహరిస్తుంటాడని మృతుని సోదరుడు దామోదర్ పోలీసులకు తెలిపాడు. ఈనెల 19న కడుపులో నొప్పి, అల్సర్ వంటి వాటికి ఏరియా వైద్యశాలలో ఓపీలో చేయించుకొని మందులు తీసుకున్నట్లు మృతుని పర్సులో ఉన్న చీటీల ద్వారా తెలిసిందని పోలీసులు తెలిపారు. అనారోగ్య సమస్యల కారణంగా నిర్మాణంలో ఉన్న స్టేడియం వద్ద పాత చీరతో గ్రిల్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఘటనా స్థలాన్ని సత్తెనపల్లి టౌన్ సిఐ పి.ప్రభాకర్, ఎస్ఐ రఘుపతి సందర్శించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి సోదరుడు, సోదరికి సమాచారం అందించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ఆర్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

మంత్రి అంబటి రాంబాబు



టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన దేవరంపాడు వాసులతో మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. రాజుపాలెం మండలం దేవరంపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కేలం వెంకటేశ్వర్లు, తాడువాయి శ్రీనివాస రావు, మేడ పోతురాజులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వేపూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని సాదరంగా ఆహ్వానించి మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువాలు కప్పారు. అలాగే పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు ఆధ్వర్యంలో న్యాయవాది రాస కౌశిక్ బాబు, పార్టీలో చేరగా మంత్రి అంబటి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు మర్రి సుబ్బారెడ్డి, తోట లక్ష్మీనారాయణ, అంబటి బ్రహ్మయ్య, రుసుం శ్రీనివాసరావు, కుప్పాల పిచ్చియ్య, శ్యామకూరి శ్రీనివాసరావు, అమృత శివప్రసాద్, తదితరులు ఉన్నారు.



పట్టణానికి చెందిన రాస కౌశిక్ బాబుకు పార్టీ కండువా కప్పుతున్న మంత్రి అంబటి